పరికరాలు అందజేస్తున్న సీపీ సుధీర్‌బాబు

రాచకొండ షీ టీమ్స్‌కు నూతన సాంకేతిక పరికరాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 3 (నమస్తే తెలంగాణ):నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మహిళలను వేధించే ఆకతాయిలను పట్టుకోవడం, వేధింపులను కట్టడి చేసేందుకు షీ టీమ్స్ సిబ్బంది వేగంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో షీ టీమ్స్‌కు లాప్‌టాప్స్, పెన్ కెమెరాలు, ప్రొజెక్టర్లు, ప్రింటర్స్, సెల్‌ఫోన్స్ తదితర సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆకతాయిల వేధింపులను నియంత్రించడం, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. మహిళల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నూతన సాంకేతిక పరికరాలతో మరింత సమర్థవంతంగా పని చేయాలని సీపీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్, ఇన్స్‌పెక్టర్లు మని, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ 400 ఎకరాల్లోకి ప్రవేశం నిషేధం

ఉత్తర్వులు జారీచేసిన మాదాపూర్ డీసీపీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): కంచె గచ్చిబౌలిలోని 400ఎకరాల వివాదాస్పద స్థలంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163ని అమలు చేస్తూ మాదాపూర్ డీసీపీ డా.జి.వినీత్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సంబంధం లేని వ్యక్తులెవరూ కంచె గచ్చిబౌలి, సర్వేనం.25లోని 400ఎకరాల వివాదాస్పద స్థలంలోకి వెళ్లడం నిషేధమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ స్థల వివాదం రాష్ట్ర హైకోర్టు, సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున ఈ భూమికి సంబంధం లేని వ్యక్తులు, బయటి వ్యక్తులెవ్వరు కూడా అక్కడికి వెళ్లరాదని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆంక్షలు ఈ నెల 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అమలులో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పార్ట్‌టైం జాబ్ అంటూ.. 17 లక్షలు స్వాహా

సైబర్‌నేరగాళ్లు చేతిలో మోసపోతున్న ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగులు

తాజాగా మోసపోయిన కానిస్టేబుల్

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఉద్యోగం చేస్తూ సాఫీగా సాగుతున్న జీవితం.. వచ్చే జీతానికి అదనంగా సంపాదించాలనే ఆశ కొందరిని సైబర్‌నేరగాళ్ల వలలోకి నెట్టి నిండా ముంచేస్తోంది. ఇందులో ఉన్నత చదువులు చదివి పెద్ద పెద్ద హోదాలలో ప్రైవేట్ ఉద్యోగాలు చేసేవారితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉంటున్నారు. ఇలాంటి సైబర్‌మోసాలపై కనీసం పోలీసు విభాగంలో పనిచేస్తున్న వారికైనా అవగాహన ఉండాలి. కానీ కొత్తగా విధుల్లోకి వచ్చిన పోలీసులు సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలు సులభంగా వింటూ మోసాపోతున్నారు. సాధారణంగా అందరికి తెలిసినంటే రివ్యూస్ అనేవి నేడు అన్ని వ్యాపారాల అభివృద్ధి ఎంతో మేలు చేస్తుంటాయి. అలాంటిది ఇంటర్‌నెట్‌లో నుంచి వచ్చే వ్యాపారులకు మరింత రివ్యూస్ కోసం ప్రాధాన్యత ఇస్తుంటారు. దీనినే సైబర్‌నేరగాళ్లు ఆసరాగా చేసుకుంటూ బడా కంపెనీల నుంచి మేసేజ్ పంపించినట్లు పంపిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఇదంతా నిజమే కదా అనే భ్రమలో ఉంటారు. వాట్సాప్, టెలిగ్రామ్ మేసేజ్‌లు చూసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసే ఉద్దేశంతో కొందరు ఆయా మేసేజ్‌లకు ప్రేరేపితమవుతున్నారు. ఇలా ఆయా మేసేజ్‌లకు స్పందించిన వారు అదృష్టం పరీక్షించుకుందామని ఆయా గ్రూప్‌లలో జరిగే చర్చలను చూసి అంతా నిజమని నమ్మేస్తున్నారు. తీరా సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు టాస్క్‌లు నిజమని నమ్మి, డబ్బులు కట్టి మధ్యలో ఇరుక్కుపోతున్నారు. అలా మధ్యలోకి వెళ్లిన వారు వెనక్కి రాలేక.. ముందుకు వెళ్తేనే పెట్టిన పెట్టుబడి బయటకు రాబట్టవచ్చనే భావనతో చాలా మంది సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు పెట్టి తీరా మోసపోతున్నారు. ఇలా సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, గృహిణిలు, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు బాధితులవుతున్నారు.

కానిస్టేబుల్‌కు రూ. 17 లక్షలు బురిడీ!

పీర్జాదిగూడకు చెందిన డిగ్రీ చేసిన బాధితుడు ఇటీవల పోలీసు విభాగంలో కానిస్టేబుల్ ఉద్యోగంలోకి చేరాడు. గత ఏడాది నవంబర్ 22వ తేదీన టెలిగ్రామ్ ఐడీకి పార్ట్‌టైమ్ ఉద్యోగం గూర్చి ఒక మేసేజ్ వచ్చింది. పార్ట్‌టైమ్ జాబ్ కావాల్సిన వారు సంప్రదించాలంటూ సూచించారు. ఆ మేసేజ్‌కు స్పందించిన కానిస్టేబుల్ ఒకే అని చెప్పాడు. వెంటనే హెచ్‌ఆర్ మేనేజర్ అంటూ మేసేజ్‌లు పంపించారు. హోటల్ బుకింగ్స్, హోటల్ రివ్యూస్ గూగుల్‌లో రాయాల్సి ఉంటుందని, మీకు ఒక ఐడీ ఇస్తాం దానికి రూ. 10 వేలు బోనస్ క్రెడిట్ అవుతుంది, ఒకో టాస్క్‌లో రూ. 90 హోటల్స్ బుకింగ్ ఉంటాయి అంటూ వివరించారు. వాళ్లిచ్చిన టాస్క్‌లు పూర్తి చేయడంతో బాధితుడి బ్యాంకు ఖాతా వివరాలు తీసుకొని రూ. 900 క్రెడిట్ చేశారు. ఆ తరువాత మీరు గోల్డెన్ స్కీమ్‌లో చేరండి, ఈ స్కీమ్‌లో చేరితే ఐదింతల కమిషన్ ఎక్కువ వస్తుందంటూ నమ్మించారు. రూ. 10 వేలు చెల్లించిన బాధితుడికి ఒక లింక్‌ను అందించడంతో అందులో అతని టాస్క్‌లు కన్పించడం, స్క్రీన్‌పై ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత లాభం వచ్చిందని కన్పిస్తోంది. మీరు ఎదైనా ఇబ్బంది పడితే కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయాలంటూ సూచనలు చేశారు. రూ. 10 వేలు డిపాజిట్ చేసిన బాధితుడికి రూ. 18223 క్రెడిట్ చేశారు. ఆ తరువాత మరికొంత డిపాజిట్ చేయడంతో స్క్రీన్‌పై మైనస్‌లో డబ్బులు సూచించడంతో మీకు మీ అమౌంట్ క్రెటిట్ కావాలంటే మరో అడుగు ముందుకేయాలని అందుకు కొంత డబ్బు చెల్లించాలంటూ నమ్మిస్తూ 25 దఫాలుగా రూ.17.70 లక్షలు సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలలో డిపాజిట్ చేసి మోసపోయాడు. ఇంకా డబ్బు అడుగుతుండడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే.. వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు

సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో మైనర్ల డ్రైవింగ్‌పై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. ఈ నెల 5వ తేదీ శనివారం నుంచి సిటీలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. మోటార్ వెహికల్ చట్టం 1988 ప్రకారం ఎవరైనా మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వెహికల్ ఓనర్, పేరెంట్స్ చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, ఒకవేళ మైనర్ పట్టుబడితే ఆ వాహన రిజిస్ట్రేషన్‌ను 12నెలల పాటు రద్దు చేస్తామని జోయల్ డేవిస్ తెలిపారు. పట్టుబడిన మైనర్‌కు 25 ఏళ్ల వరకు ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వకుండా నిబంధనలు ఉన్నాయని, నగర ప్రజలు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్‌కు సహకరించి ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదంటూ సూచించారు.

శోభాయాత్ర ప్రశాంతంగా జరగాలి

పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించిన సిపి సివి ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): శ్రీరామనవమి శోభయాత్ర సందర్భంగా హైదరాబాద్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో శోభయాత్ర సందర్భంగా జరిగిన సంఘటనలు, బందోబస్తు ఏర్పాట్ల విషయమై చర్చించి వారికి తగిన సూచనలు చేశారు. చిన్న ఊరేగింపులు అనుసంధానమయ్యే కూడలి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, మతపరమైన ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని నిరంతరం నిఘా కొనసాగించాలని సీపీ సూచించారు. ముందస్తు చర్యగా అధికారులు, సిబ్బంది, సిటీలోని అన్ని జోనల్ కంట్రోల్ రూమ్ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ చైతన్యకుమార్, ఐటీ సెల్ డీసీపీ పుష్ప పాల్గొనగా వర్చువల్ జోనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాచకొండ కమిషనర్ కార్యాలయంలో..

పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీపీ సుధీర్‌బాబు

శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కల్గకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. శ్రీరామ నవమి వేడుకలు, అదే రోజు ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్ ఉండడంతో బందోబస్తు ఏర్పాట్లకు సంబంధించి డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులతో శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే శోభాయాత్ర వంటి కార్యక్రమాలకు బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ విభాగపు అధికారులు, సిబ్బంది శోభాయాత్ర ఉరేగింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆదివారం ఉప్పల్‌లో క్రికెట్ మ్యాచ్ కూడా ఉండడంతో బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. స్టేడియం పరిసరాలలో ఉన్న సీసీ టీవీల ద్వారా నిరంతరం నిఘా పెంచాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, నర్సింహారెడ్డి, అరవింద్‌బాబు, శ్రీనివాసులు, మల్లారెడ్డి, ఉషా విశ్వనాథ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తికి 25 ఏళ్ల జైలు..

అబిడ్స్ ఏప్రిల్4: మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తికి 25 సంవత్సరాల జైలు శిక్ష ఐదువేల జరిమానా విధిస్తూ శుక్రవారం 12వ అడిషనల్ సెషన్స్ జడ్జి టి .అనిత తీర్పునిచ్చారు. ఈ మేరకు మంగళ్ హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ వివరాల ప్రకారం.. ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్ ప్రాంతంలో నివసించే సత్యనారాయణ చారి 2022లో తన ఇంటి సమీపంలో నివసించే మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఈ కేసును ముందుగా బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన జరిగిన ప్రాంతం మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోనిది కావడంతో మంగళ్‌హాట్ పోలీసులు కేసును అన్ని కోణాలలో విచారించి సత్యనారాయణ చారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన12వ అడిషనల్ సెషన్స్ జడ్జి టి.అనిత శుక్రవారం నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. జరిమాన చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసులను దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్ర మోహన్ అభినందించారు.

మరో ఘటనలో..

పహాడీ షరీఫ్, ఏప్రిల్ 4: లైంగిక దాడికి పాల్పడిన ఒకరికి పదేండ్ల జైలు శిక్ష పడింది. పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి వివరాల ప్రకారం అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స కోసం వెళ్తూ తన కుమార్తెను బాలాపూర్‌లో ఉండే స్నేహితుడు సయ్యద్ హాజీకి అప్పగించాడు. అయితే హాజీ ఆ అమ్మాయిపై లైంగిక దాడికి పాల్పడగా.. ఇంటికి చేరుకున్న అమ్మాయి జరిగిన విషయం తండ్రికి చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 2022లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. కేసు పూర్వాపరాలు తెలుసుకున్న న్యాయమూర్తి శుక్రవారం నిందితుడికి పదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బెట్టింగ్ ముఠా అరెస్ట్

చార్మినార్, ఏప్రిల్ 4: బెట్టింగ్ నిర్వహిస్తున్న పలువురిపై సౌత్ ఈస్ట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ అందే శ్రీనివాస రావు వివరాల ప్రకారం నారాయణగూడకు చెందిన గురువిందర్ సింగ్ సాలూజ అలియాస్ గౌరవ్ (41)ముకేశ్, సర్దార్ జస్విందర్ సింగ్ అలియాస్ జెస్సి, లిక్కి, కొప్పుల కార్తీక్‌లు స్నేహితులు. మహారాష్ట్ర లోని వికాస్ తో కలిసి బుకీలుగా కొనసాగుతున్నారు. ఈ ముగ్గురు బెట్టింగ్ నిర్వహించేందుకు రాధే ఎక్స్ఛేంజ్‌వెబ్‌లింక్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నాందేడ్‌కు చెందిన వికాస్, కాచిగూడకు చెందిన ముకేశ్‌ల వద్ద నుంచి పాస్‌వర్డ్‌లను సేకరించి ఫంటర్ లకు అందించే వారు.ఈ సమాచారం అందుకున్న పోలీసులు గురువిందర్ సింగ్, జస్విందర్ సింగ్, కొప్పుల కార్తీక్ ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1.32 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

సిటీబ్యూరో, ఏప్రిల్ 04, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై పథకం ఫేజ్-2 లో భాగంగా పటాన్ చెరు నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్ కు ఆరీసీ పురం, ఫాదర్ స్కూల్, ఓల్డ్ ముంబయి రోడ్డు ప్రాంతాల్లో భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జల మండలి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

మాజీ హోంగార్డే చైన్‌స్నాచర్

శామీర్‌పేట, ఏప్రిల్ 4: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో సస్పెన్షన్‌కు గురైన హోంగార్డును పోలీసులు పట్టుకున్నారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రాములు ఈ కేసు వివరాలు వెల్లడించారు. మార్చి 28న దొంగల మైసమ్మ చౌరస్తా వద్ద ఆటో కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలి వద్దకు బైక్‌పై వచ్చిన వ్యక్తి తాను పోలీస్ నని చెప్పి కీసర మండలం ధర్మవరం తోట దగ్గర దింపుతానని నమ్మించి బైక్ ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి ఆమె మెడలో ఉన్న రెండు తులాల మంగళసూత్రాన్ని బలవంతంగా లాక్కొని, అక్కడినుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు అడ్డగుట్టకు చెందిన పంది నరేశ్ కుమార్(42) గా గుర్తించారు. అతడిని పట్టుకొని, రెండు తులాల బంగారు గొలుసు, ఒక సెల్‌ఫోన్, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో హోంగార్డుగా పని చేశాడని, అతని పనితీరు బాగాలేక అధికారులు తొలగించారని ఏసీపీ రాములు తెలిపారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని.. పోలీసు శాఖ నుంచి తొలగించి నప్పటికీ తాను పోలీస్ శాఖలో పని చేస్తున్నానని చెప్పుకుంటూ నేరాలకునేరాలకు పాల్పడుతున్నాడని ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ ఏసీపీ శశాంక్ రెడ్డి, సీఐ శ్రీనాథ్, డీఐ గంగాధర్, సీసీఎస్ నాయుడు, ఎస్ఐలు హారిక, దశరథ్ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు పోగొట్టుకున్న నగదు రికవరీ చేసి చెల్లిస్తున్న సిపి సివి ఆనంద్

సైబర్‌క్రైమ్‌లో పోగొట్టుకున్న నగదు తిరిగి చెల్లింపు!

మార్చి నెలలో రూ.3.27కోట్ల రికవరీ

54 మంది బాధితులకు అందించిన సైబర్ పోలీసులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు కోల్పోయిన బాధితులకు సైబర్ క్రైమ్ పోలీసులు ఆ డబ్బులను రికవరీ చేసి అందించారు. మార్చి నెలలో మొత్తం 54 మందికి వివిధ రకాలుగా జరిగిన మోసాల్లో కోల్పోయిన రూ.3,27,86,687అందించినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితులకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చెక్‌లు అందించారు. మోసపోయినట్లు గుర్తించిన వెంటనే తమకు ఫిర్యాదులు అందడంతో తాము విచారణ చేపట్టి సదరు బ్యాంక్‌ల ద్వారా ఆయా అకౌంట్లను సీజ్ చేయడం, డబ్బులు విత్ డ్రా చేయకుండా చూడడం ద్వారా ఈ సొమ్మును రికవరీ చేయగలిగామని ఆయన పేర్కొన్నారు. 12వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి అనూష ఆదేశాల మేరకు తాము రికవరీ చేసిన సొమ్ము మొత్తాన్ని బాధితులకు అందించామన్నారు. స్టాక్ ట్రేడింగ్‌లో మరియు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసపోయిన 32 మందికి రూ.1,62,19,544,ఫెడెక్స్ మరియు మనీలాండరింగ్‌లో 14 మందికి రూ. 1,57,25,141,క్యూఆర్‌కోడ్ ఫ్రాడ్‌లో ఒకరికి రూ.43,310, క్రెడిట్‌కార్డ్ ఫ్రాడ్‌లో మోసపోయిన ఒకరికి రూ.88,591,కస్టమర్ కేర్ పేరుతో మోసపోయిన నలుగురికి రూ. 3,70,391, ఏపికె ఫైల్ మోసంలో ఇద్దరు బాధితులకు రూ.3,39,700లు అందించామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. నగదు రికవరీకి కృషి చేసిన సైబర్ టీమ్ సభ్యులను సీపీ సీవీ ఆనంద్ అభినందించారు.

రూ.40లక్షలు రికవరీ చేసిన సైబర్ పోలీసులు..!

నగరానికి చెందిన 52 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓటీపీ మోసంతో రూ.47లక్షలు కోల్పోయాడు. అతను వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు నేతృత్వంలో బృందం దర్యాప్తు చేపట్టి కోర్టు ఆదేశాల మేరకు బ్యాంకుల ద్వారా రూ.40లక్షలను రికవరీ చేయగలిగారు. ఈ మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా బాధితుడికి పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అందించారు.

ఈ నెల 6న ట్రాఫిక్ ఆంక్షలు..

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 6న సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ ఉండడంతో స్టేడియం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. 6వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11.50 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని చంగిచర్ల, బొడుప్పల్, పీర్జాదీగూడ వైపు నుంచి వచ్చే వాహనాలను హెచ్‌ఎండీఏ భగాయత్ నుంచి నాగోల్ వైపు, ఎల్బీనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద నుంచి హెచ్‌ఎండీఏ లే అవుట్ వైపు, తార్నాక నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ నుంచి చర్లపల్లి వైపు, రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలు స్టీట్ నెంబర్ 8 నుంచి హబ్సిగూడ వైపు మళ్లిస్తున్నట్లు వెల్లడించారు.

టీ మాస్టర్‌గా చేరిన 15 రోజులకే..

బంజారాహిల్స్ ఏప్రిల్ 4: రెస్టారెంట్లో టీ మాస్టర్‌గా చేరి15 రోజులు గడవకుండానే కౌంటర్లో డబ్బులు తస్కరించి ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జార్ఖండ్ రాష్ట్రం బిదినియా గ్రామానికి చెందిన పవన్ యాదవ్ శ్రీ కృష్ణానగర్ లోని అమృతం అడ్డా రెస్టారెంట్లో గత నెల 21న టీ మాస్టర్‌గా చేరాడు. నెలకు రూ. 34000 జీతం మాట్లాడుకున్నాడు. వారం రోజుల క్రితం రూ 3000 అడ్వాన్స్ తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత మరో 7000 అడ్వాన్స్ ఇవ్వాలని పవన్ యాదవ్ మేనేజర్ సలీంను కోరాడు. పది రోజులు ఆగిన తర్వాత ఇస్తానని చెప్పిన సలీం రంజాన్ పండుగకు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇద్దరు సిబ్బందికి రూ.7000 చొప్పున ఇవ్వాలని పవన్ యాదవ్‌కు డబ్బులు ఇచ్చి వెళ్లాడు. గురువారం సాయంత్రం కౌంటర్లో ఉన్న రూ.15 వేలతో పాటు ఇతర సిబ్బందికి ఇవ్వాల్సిన రూ. 14 వేలతో పవన్ యాదవ్ ఉడాయించాడు. ఈ మేరకు మేనేజర్ సలీం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శిక్షణలో ఉన్న ఆర్మీ అధికారి అదృశ్యం

బొల్లారం, ఏప్రిల్4: బొల్లారం 1ఈఎంఈ కేంద్రం (టీఈఎస్-51)లో శిక్షణ పొందుతున్న ఓ ఆర్మీ అధికారి అదృశ్యమయ్యారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. బొల్లారం 1ఈఎంఈలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్రకు చెందిన ప్రతీక్ కుమార్(19) ఈ నెల 3న ఉదయం 4 గంటలకు డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ రామారావు రోల్‌కాల్ పిలువగా కనిపించకపోవడంతో శిక్షణా కేంద్రం అంతా వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో ఆర్మీ అధికారులు మహారాష్ట్రలో ఉంటున్న కుటుంబ సభ్యులను విచారించినా ఫలితం కనిపించ లేదు. ఈ మేరకు ఆర్మీ అధికారి సుబేదార్ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ రావిల్లా రామారావు ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు మిస్సింగ్‌కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

పోలీస్‌మంటూ నమ్మించి కిడ్నాప్..

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: ప్రేమ జంట ఇల్లు వదిలి వెళ్లేందుకు సహాయం చేశారంటూ పోలీసులమంటూ నమ్మించి ఇద్దరు యువకులను కిడ్నాప్ చేయడంతో పాటు దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కృష్ణానగర్‌లో నివాసముంటున్న భూమిరెడ్డి కిశోర్‌రెడ్డి టీవీ నటుడు ఇంద్రనీల్ వద్ద పీఏగా పని చేస్తుంటాడు. కిశోర్‌రెడ్డి, సందీప్, పల్లె శివ ఒకే గదిలో ఉంటారు. పల్లె శివ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట సమీపంలోని ఉప్పునుంతల గ్రామానికి చెందినవాడు. శివ తన ఊరికి చెందిన ముస్లిం యువతిని ప్రేమించాడు. ఇటీవల వారిద్దరూ ఇంట్లో నుంచి వెళ్లిపోగా.. శివ ఆచూకీ వెతుకుతూ యువతి కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం పోలీస్‌స్టిక్కర్ ఉన్న థార్ కారులో కృష్ణానగర్ వచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చామని, అచ్చంపేటలో యువతీ కిడ్నాప్ కేసులో విచారణ కోసం రావాలంటూ బలవంతంగా శివ రూమ్ మేట్స్ అయిన కిశోర్ రెడ్డి, సందీప్‌ను వాహనంలో ఎక్కించుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు కాకుండా తుక్కుగూడ వైపు తీసుకెళ్లి కారులో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇద్దరిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ సమాచారం అందుకున్న టీవీ నటుడు ఇంద్రనీల్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వాకబు చేశాడు. తాము ఎవరిని తీసుకురాలేదని, వచ్చినవారు ఎవరో తెలియదని ఇక్కడి పోలీసులు చెప్పారు. దీంతో కిశోర్ రెడ్డి ఫోన్‌కు కాల్ చేసిన ఇంద్రనీల్ వెంటనే కిడ్నాప్ చేసిన ఇద్దరిని తీసుకు రావాలని ఆగంతకులను కోరగా వారు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో వదిలి వెళ్లిపోయారు. అచ్చంపేట వెళ్లిన ఇంద్రనీల్ వారిని విడిపించుకొని రాగా.. బాధితుడు కిశోర్‌రెడ్డి శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టార